# పుస్తె

కోటు విప్పుతూ అడిగాడు కరుణాకరరావ్; '' ఏం అదోలా ఉన్నావ్? ఒంట్లో బాగా లేదా ?''

'' బాగానే ఉంది !'' నిట్టూర్చింది పంకజం.

కరుణాకరరావ్ ఆమెను మరి మాటాడించలేదు.

– ''అమ్మా! నాకు ఆకలేస్తోంది....'' చిన్నాడు మారాం చేస్తున్నాడు. పంకజం యేదో ఆలోచనలో ఉంది.

కరుణ కోర్టుబట్టలు మార్చుకుని పైజమా, కల్లీలాల్చీ తొడుక్కుని డ్రాయింగ్‌రూంలోకి వచ్చి అక్కడ కూర్చోడానికి మనసు ఒప్పక వంటగదిలోకి వెళ్లాడు.

పంకజం ఉప్మాకి పోపు వేస్తోంది.

'' వంటమనిషి యేమైంది ?''

''బజారుకి పంపా ! ఇకనేనీ ఉద్యోగం చెయ్యలేను !'' ఒక్కసారి భార్య అంతమాట అనేసరికి కరుణకి ఆశ్చర్యం వేసింది.

ఇద్దరూ ఒకే వూళ్లో ప్రాక్టీసు చేస్తూవుండే వారు. కోరి తను లాయరు భార్యే కావాలనుకుని పంకజాన్ని పెళ్లిచేసుకున్నాడు.

పంకజం చాలా సామాన్యమైన కుటుంబంలోనుంచి వచ్చింది. అన్న కష్టపడి పంకజాన్ని కాలేజీలో పెట్టి చదివించాడు. చెల్లెలు ఇష్టపడిన సంబంధమనీ, కానీ కట్నం కోరని వరుడనీ సంతోషంతో తన సంబంధం చేశాడు.

భార్యాభర్తలిద్దరూ మున్సబు మెజిస్ట్రేట్ వుద్యోగాలకి పెట్టారు.... చిన్నవాడు సంవత్సరం బిడ్డ... పంకజానికి ఉద్యోగం వచ్చింది. కరుణ ప్రోద్బలంతో ఉద్యోగంలో చేరింది.

ఆమెలో ఎందుకీరోజు వెలితి ? ... ఎప్పుడూ లేదు... తనేమో పక్కవూళ్లోనే ఉన్నా వారం వారం వస్తూనే వున్నాడే! తనని వదలివుండలేకపోతోందా ?

'' అమ్మా ! నాకు ఆకలేస్తోంది....'' ఆడుకోటానికని వెళ్లిన పెద్దవాడూ వచ్చేశాడు.

'' నాన్నా ! వెళ్లి బిస్కెట్టు ప్యాకెట్లు తెచ్చుకో !''

'' నాకొద్దు ! '' చిన్నవాడు బింకంగా చెప్పాడు.

'' చేస్తున్నారా ఒక్క ఐదునిమిషాలు ...''

'' వంటమనిషిని ఎందుకు పంపించేశావ్''

'' అంటే ఈ మాత్రం కూడా మనం కలిసి ఉండకూడదనా ....''

'' అదేం కాదు. నీ మనసులో యేదోబాధ ఉంది.... చెప్పడానికి ఎందుకో అభిమానం అడ్డువస్తోంది.....''

'' నాకొచ్చిన ఉద్యోగం మీకు రావాల్సింది... '' పంకజం గొంతులో యేదో ఆర్ద్రత....

''సర్కారు సేవలో కొన్ని మనకు నచ్చని ప్రతిబంధకాలుంటాయని నాకు తెలుసు.... ఇంతకీ నీవు విచారించబోతున్న ఆ క్లిష్టమైన కేసేమిటో ?... ఉండు ప్లేట్లు తెస్తా....''

'' నాకు అమ్మే పెట్టాలి .... రోజూ కాంతమే పెడుతుంది....'' పంకజం వాణ్ణి వాటేసుకుంది.

''నాకు కొంచెం పెరుగుకావాలి... '' చిన్నవాడు ప్రారంభించాడు.

నలుగురూ ఫలహారం ముగించారు. పిల్లలిద్దరూ మళ్లీ ఆటలోకి వెళ్లిపోయారు.

'' వడ్డీ వ్యాపారం చెయ్యడం అధర్మం కదూ!'' పంకజమే చటుక్కున అడిగింది.

'' తగిన లైసెన్స్ లేకుండా చేయ్యడం నేరం !''

'' చట్టం నాకూ తెలుసు ''

'' ధర్మం విషయం అందరికీ తెలిసినట్టే ఉంటుంది. అదే గొడవ.....''

'' పుస్తె తాకట్టుపెట్టి ...''

'' పెట్టడం అధర్మంకాదూ ? '' కరుణ అడ్డుతగిలాడు.

''అవసరం అల్లాంటిదయినప్పుడు .... అది ఎంత పవిత్రమైనదైనా ప్రాణం దాని కంటే విలువైనదేకదా ?.... పుస్తెతాకట్టు పెట్టి దాన్ని వాకట్టుచేసి బంగారం స్వంతం చేసుకోడం ఎంత నీచం ?''

'' చట్ట విరుద్ధం కూడా ...'' కరుణ ఖాళీ కప్పులో చెంచా తిప్పుతూ అన్నాడు.

''చట్టప్రకారం అతన్ని శిక్షించినా... సరేలెండి... ఇంతకీ సమస్య అదికాదు ... మనిషిలో పరివర్తన తీసుకురావాలి ''

''పరివర్తన కోసం ఉద్దేశింపబడినదే శిక్ష ....''

'' శిక్ష లేకుండా పరివర్తనను తీసుకురావడం సాధ్యమేమో !'' పంకజం సాలోచనగా అంది.

''న్యాయాధికారిణిగా అది నీ పరిధిలోకి రాదేమో !''

–అక్కడికి ఆసంభాషణ ఆగిపోయింది.

ప్లేట్లూ గ్లాసులూ తీసి సింకులో వేయడంలో పంకజానికి సహాయం చేస్తున్నాడు కరుణ. పంకజం నిశ్శబ్దంగానే ఉంది.

''నీ మనసులో ఆలోచన – కాదు సందేహాన్ని నాకు విడమరచి చెప్పడానికి నువ్ సందేహిస్తున్నావ్! నీ అధికారం కానీ, వృత్తిరీత్యా ఉండే కొంత ప్రతిబంధకంగానీ అడ్డు వస్తోంది... పిల్లలు రడీగా ఉన్నారు... రేపు శెలవు... కొంతసేపు అలా తిరిగివద్దాం ....'' కరుణ అన్నాడు.

తిరిగి వచ్చి పిల్లలకు పెట్టి తమ భోజనాలు ముగించుకుని భార్యా భర్తలిద్దరూ మేడమీదకి వెళ్లారు.

''కారణం ఏదయినా సరే – చెయ్యాలనున్నది చెయ్యలేకపోడాన్ని – అశక్తతని ఎలా ఎదుర్కోనాలి?'' పంకజం అడిగింది.

'' కారణం లేకుండానే నువ్ చెయ్యాలనుకున్నది చెయ్యడానికి వెనకాడుతున్నావ్.... పుస్తె అంటే జ్ఞాపకం వచ్చింది .... మీ అన్నయ్యా నాకు ఒకసారి చెప్పాడు. నీ మనసులో వున్న కేసు నువ్ నాకు చెప్పకపోయినా నేను తెలుసుకున్నాను ...''

''నిజం ?''

''సుమారు ఇరవైఏళ్ల క్రిందట, అప్పటికి నీకు పదిఏళ్లు కూడా వుండి వుండవ్... మీ అన్న ఎస్సెల్సీ చదువుతున్నాడు. మీ అమ్మకి జబ్బు చేసింది. మీ అమ్మ పుస్తెలు తీసి మీనాన్న తాకట్టు పెట్టడం జరిగింది... దాన్ని తాకట్టు పట్టినవాడు ఒక బడిపంతులు... నువ్ చిన్నప్పుడు చదువుకున్న

ఊరికే నువ్ న్యాయాధికారిణిగా వెళ్లావ్... బహుశః ఆ పెద్దమనిషి నీకు తారసపడి ఉంటాడు... లేదా నువ్ విచారించవలసిన ఒక దావాలో వాదిగానో, ప్రతివాదిగానో వచ్చివుంటాడు. అతన్ని శిక్షించే అవకాశం నీకు వచ్చింది.... కాని....''

'' నాకు అతనిమీద కసిలేదు ... అతన్ని మంచిమార్గంలో పెట్టడానికి.....ఇదొక అవకాశమేమోనని...''

''సెంటిమెంటాలిటీ ఆడవాళ్లు – సుమారు అందరూ... అందునా పుస్తె కట్టించుకున్న వాళ్లందరూ పుస్తెకట్టేది సెంటిమెంటాలిటీనే... అతన్ని మంచిమార్గంలో పెట్టగలననుకోడం మంచితనంమాట దేవుడెరుగు కేవలం సెంటిమెంటాలిటీ... ఇంకాపోతే నీ అవగాహనా లోపం .... ఇరవై ఏళ్లయి – కాకపోతే ఇంకా ముందునుంచీ చేస్తున్న వ్యాపారం ఇప్పుడు నువ్ మాటలతో చెబితే అతను ఆపేస్తాడా ?... నీకు అతని దగ్గర లైసెన్స్ లేదని తెలుసు .... చట్టం తెలుసు .... పరివర్తన తెప్పించాలనుకుంటూ శిక్షించడానికి వచ్చిన అవకాశాన్ని వినియోగించకుండా మనసు సరిపెట్టుకోడానికి ప్రయత్నం చేస్తున్నావ్''

''మీకు ఆలోచనలు ఎక్కువ .... '' అతనీ కళ్లలోకి ఆరాధనగా చూస్తూ అంది పంకజం.

''చట్టం నేరాన్ని శిక్షించగలదు... కాని శిక్ష పరివర్తనని తీసుకురాగలదన్న భరోసా ఉన్నట్టులేదు. పరివర్తనకి మార్గం శిక్షేనని చట్టం నమ్మకం ...''

'' నిజమే.... కాని అతన్ని ఒకసారి ఛేంబర్స్‌లోకి పిలిచి ...''

'' అదే చెయ్యకూడనిపని... నువ్ అతని మీద కసి తీర్చుకుంటున్నావని, అతన్ని బెదిరించడానికి ప్రయత్నం చేశావనీ ... ఎదురుతిరిగి నీ మీద పిటీషన్ పెడితే ... దోవనపోయేదాన్ని నెత్తికెక్కించుకున్నట్టవుతుంది... అతను చేసేది అధర్మమనీ తెలుసు ... చట్టవిరుద్ధమనీ తెలిసి శిక్షించడానికెందుకు వెనకాడాలో నాకు అర్థంకావడంలేదు.

''ఆరోజు అతను అప్పు ఇవ్వకపోతే అమ్మ చచ్చిపోయేదికాదా ?''

'' అందుకని అతన్ని క్షమించేయ్ .... ఇదే సెంటిమెంటాలిటీ ...''

కరుణ ఆగిపోయాడు.

– జీవన్మరణ సమస్యలో పుస్తె అమ్మచూపడం మనసుకి నచ్చనిపని... ఎప్పటికైనా విడిపించుకునే అవకాశంతో తాకట్టు పెట్టుకోవడమే సమంజసంగా కనపడుతుంది... అప్పు ఇవ్వడం నేరంకాదు...కాని ,,, ఈ కేసులో ప్రతివాది దగ్గర భార్య పుస్తెలు తాకట్టు పెట్టి డబ్బు వాడుకున్నాడు... ఎనిమిది నెలల తరువాత విడిపించుకుంటానని డబ్బు పట్టుకెళ్లాడు. ప్రతివాది వస్తువు తన దగ్గర తాకట్టు పెట్టలేదనేశాడు.... భార్య పుస్తెలు విడిపించి మరణశయ్య మీదనున్న ఆమె మనసుకి రవంత ఊరట కలిగిద్దామని భర్త – వాది తాపత్రయం ... తను సాధ్యమైనంత త్వరలో తీర్పుచెప్పాలి... చెప్పకుండానే ఆమె మరణిస్తే ?

న్యాయం ఉంది.... ధర్మం ఉంది .... చట్టం ఉంది .... మనసుంది ... బుద్ధిఉంది... ఎలా చెప్పాలి ? ఏం చెయ్యాలి ?

ఆలోచించి ఆలోచించి నిద్రపోయింది పంకజం

సోమవారం బస్సుకి బయలుదేరుతూ చెప్పాడు కరుణ ; '' నీకు అన్నీ తెలుసు ....నీ

ఆలోచనలతో నువ్ ముందుకు వెళ్ళు... నీ చాకచక్యం మీద నాకు నమ్మకముంది .... మరివస్తా...''

కరుణ వెళ్లిపోయాడు.

ఒకరోజు పిల్లలిద్దరినీ తీసుకుని బజారుకి పోతూ ఉండగా ఎదురుగా వస్తున్న మనిషిని చూసి చటుక్కున ఆగి -

'' నమస్కారం, మాస్టారూ '' అంది పంకజం.

'' నమస్కారం.... అమ్మా, నువ్వెవరో, నేను తెలుసుకోలేకపోతున్నా ... ఎవరమ్మాయివి?'' మాస్టారు అడిగారు.

''నేను ఈ ఊర్లో నా చిన్నతనంలో చదువుకున్నా ... మీరు నాకు మాస్టారు.... మాధవయ్యగారు మా నాన్నగారు. అప్పుడు వాళ్ల ఆఫీసు చర్చివీధిలో ఉండేది.... మా అమ్మకి జబ్బుచేస్తే మీరు పుణ్యం కట్టుకుని అప్పిచ్చారు .....''

''అలాగా ! అదెప్పటిమాటమ్మ ! తాకట్టుకని ఏదో కొంపమునిగే అవసరమని ఎంతో మంది ఏమిటేమిటో తెస్తుంటారు .... నీలా అందరూ అప్పు ఇచ్చినందుకు కృతజ్ఞులుగా ఉండరమ్మా... ఇంతకీ నువ్... ఈ ఊళ్లో ''

'' ఉద్యోగం చేసుకుంటున్నా ! ''

'' ఎక్కడో చూసినట్టుందిలే ...''

''మాస్టారూ! మీకు పుణ్యం ఉంటుంది. పుస్తెలు తాకట్టు పెట్టే వాళ్ల ఎడల కొద్దిగా జాలి చూపండి !'' గంభీరంగా అంది పంకజం.

'' ఆరునెలలైనా వడ్డీకూడా కట్టకపోతే... యేం చెయ్యమంటావ్ ? ఇంతకీ ...''

మాస్టారి ముఖం చటుక్కున ఎర్రబడింది.

''అమ్మా నువ్ పంకజం ... మెజిస్ట్రేటమ్మాయివికదూ ... ఇప్పుడే జ్ఞాపకం వచ్చింది నేను వ్యాపారం మానేశానమ్మా ....''

'' కోర్టులో చెప్పండి మాస్టారు మెజిస్ట్రేట్‌తో ....''

- ఆకేసు వాయిదా వచ్చింది.

పంకజం కోర్టు హాలంతా పరికించి చూసింది ... దావా ఉపసంహరించుకుంటానంటూ వాది పిటిషన్ దాఖలు చేశాడు.

పంకజం తెల్లబోయింది.

చాలా రోజుల తరువాత కరుణ ఒకసారి అడిగాడు భార్యని. ''మీ మాస్టారి కేసు ఏమైంది? తీర్పు చెప్పావా? '' అంటూ నవ్వుతూ తనే అన్నాడు ''నువ్ ఆయనతో మాటాడావ్.... ఆయన రాబోయేది గ్రహించి నాలుగు రెట్ల బంగారం ఇచ్చి దావా ఉపసంహరింపచేసుకున్నాడు ...''

'' నేను శిక్ష వెయ్యాలనే అనుకున్నాను ''

'' కాని వెయ్యలేకపోయావ్ ! .... దిగులుపడకు ... అతన్ని ఇప్పుడిక కనికరించేవాళ్లుండరు... ఆదాయపు పన్నువాళ్లు - ఇతర అధికారులూ సెంటిమెంట్‌కి పుస్తెకట్టరు ....''

కరుణ పిల్లవాడిని ఎత్తుకుంటూ అన్నాడు.

**స్వాతి సపరివారపత్రిక**

14.2.86.